క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగన్ పాలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి, దేశానికే ఆదర్శంగా పాలన చేయటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. తానా, నాటా సభల్లో పాల్గొన్న గౌతంరెడ్డి దంపతులను గురువారం ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు బాబావారికి విశేషంగా పూజలు చేసి బాబావారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను అమెరికాలో సైతం కీర్తిస్తున్నారన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైదిక కమిటీ సభ్యుడికి రూ.10 వేల జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని అమ్మవారి నివేదనశాలలోకి సామాన్య భక్తుడిని అనుమతించిన ఘటనపై వైదిక కమిటీ సభ్యుడు బి.శంకర శాండిల్యాకు ఆలయ ఈవో భ్రమరాంబ రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ నెల 17న ఓ భక్తుడిని వైదిక కమిటీ సభ్యుడు నివేదనశాలలోకి తీసుకువెళ్లి ప్రసాదం ఇచ్చిన ఘటన దుర్గగుడిలో వివాదస్పదమైంది. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఆలయ ఈవో భ్రమరాంబ సెక్షన్ ఇన్‌చార్జితో పాటు బాధ్యతుల నుంచి వివరణ అడిగి తెలుసుకున్నారు. అర్చకేతరుడిని నివేదనశాలలోకి అనుమతించినట్లు రుజువు కావడంతో సదరు వైదిక కమిటీ సభ్యుడికి రూ.10 వేలు జరిమానా విధించారు. నివేదనశాలను సంప్రోక్షణ చేయడంతో పాటు మరో మారు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలని వైదిక కమిటీ సభ్యులు, అర్చకులను ఈవో హెచ్చరించారు.

రేపటి నుంచి పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ కడప జిల్లా కడప నగరంలో యూటీఎఫ్ భవనంలో ఈనెల 22, 23 తేదీల్లో రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు, జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో గురువారం శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందని, ఫెలోషిప్‌లకు కోత విధించిందని విమర్శించారు. విద్యారంగ సమస్యలు, విధానాలపై శిక్షణ తరగతుల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వైష్ణవ్, దుర్గాప్రసాద్, వేణు, ఉదయ్, విక్రమ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ దుర్గాపురం సబ్‌స్టేషన్ 11 కె..వి గులాబీతోట ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ గురువారం తెలిపారు. పున్నయ్యకాలనీ, సాయిప్రసన్న వీధి, నేతాజీ వీధి, సాయిబాబా వీధి, గణపతి వీధి, కూనపురెడ్డి స్ట్రీట్, మోహన్‌గాంధీ స్ట్రీట్, కాకర్లమూడి వీధి, గులాబీతోట భానూనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

గుండెపోటుతో విజయవాడ వాసి మృతి



దుర్గారావు(ఫైల్)

ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఏపీకి చెందిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందారు. గ్రంథాలయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం .. విజయవాడ ఎస్ఎస్‌సీ బోస్‌నగర్‌కు చెందిన తంగెళ్లమూడి దుర్గారావు(40) కొద్ది రోజులుగా జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వస్తున్నారు. ఆయన ఖమ్మంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, సంస్థల్లో ఉద్యోగం కోసం యత్నిస్తూనే గ్రంథాలయానికి వచ్చేవాడు. గురువారం ఉదయం 11.30 గంటలకు వచ్చిన దుర్గారావు మంచినీళ్లు తాగుతూ కుప్పకూలాడు. తొలుత ఫిట్స్‌గా భావించిన గ్రంథాలయ సిబ్బంది 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, మార్గమధ్యలోనే దుర్గారావు మరణించినట్లు వైద్యులు తెలిపారు. కాషాయం లుంగీ, ఓ సంచితో నిత్యం దుర్గారావు లైబ్రరీకి వచ్చేవాడని చెప్పిన ఉద్యోగులు... ఆయన వద్ద ఫోన్‌లోని నంబర్లకు ఫోన్ చేస్తే సరైన సమాధానం లేదని చెప్పారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చగా పోలీసులు వివరాల కోసం యత్నిస్తున్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదరిక నిర్మూలనే ధ్యేయంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 244వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జోరు వానలోనూ ప్రజాప్రతినిధులకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్‌కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలియజేశారు.

పేదలకు సైతం కార్పొరేట్ విద్య, వైద్యం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు సైతం కార్పొరేట్ విద్య, వైద్యం అందిస్తున్నారని, రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. పర్యటనలో భాగంగా స్థానిక ఎం.కె.బేగ్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చామని విష్ణు తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. ఎం.కె.బేగ్ పాఠశాల ప్రాంగణంలో రూ.2.27 కోట్ల నిధులతో నిర్మిస్తున్న 20 అదనపు తరగతి గదులను అక్టోబర్ 2 నాటికల్లా పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పేదరిక నిర్మూలనలో ఏపీ భేష్

కేవలం నాలుగేళ్ల కాలంలోనే పేదరికంపై రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించిందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. 12 అంశాల్లో నీతిఆయోగ్ నిర్దేశించిన లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం అధిగమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. 2016 డిసెంబర్ నాటికి ఏపీలో 11.77 శాతం మంది ప్రజలు నిరుపేదలుండగా.. 2021 డిసెంబర్ నాటికి 6.06 శాతానికి తగ్గారని తెలిపారు. జనాభాలో 10 శాతంలోపే పేదలు ఉండాలన్న లక్ష్యాన్ని నవరత్నాల పథకాల రూపంలో ఈ ప్రభుత్వం సాధించిందని వెల్లడించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై బీజేపీ నాయకులు పనిగట్టుకుని చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. రాష్ట్ర అప్పుల గూర్చి మాట్లాడే ముందు కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని లక్షల కోట్ల అప్పులు ఉన్నాయో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబితాలోనూ అనేక బీజేపీ పాలిత రాష్ట్రాల అప్పులు ఆంధ్రప్రదేశ్ కన్నా ఎక్కువ ఉన్నట్లు స్పష్టమైందన్నారు. రాష్ట్ర ప్రతిష్టను మసకబార్చే ప్రయత్నాలు విపక్షాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● టార్గెట్ క్లీన్ కృష్ణా కెనాల్స్

మిషన్ - కృష్ణానది, కాలువల ప్రక్షాళనకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. నగరంలోని కెనాల్స్‌లో వేసే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు మూడు క్లీనింగ్ బోట్లను ఏర్పాటు చేసింది. ఈ బోట్లను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు గురువారం ప్రారంభించారు. అనంతరం బోట్‌లో పర్యటించి పర్యవేక్షించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మాతా శిశు మరణాలను అరికట్టాలి

కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాతా శిశు మరణాలను కనీస స్థాయికి తగ్గించి, దశల వారీగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఈ ఏడాదిలో జరిగిన మాతా శిశు మరణాలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. జూన్ నెలలో జరిగిన మాతా శిశు మరణాలపై సంబంధిత సచివాలయ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో పాటు ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా శిశు మరణాల్లో వైద్యుల నిర్లక్ష్యం లేనప్పటికీ, మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. జరిగిన మరణాలను విశ్లేషిస్తే నిరుపేద కుటుంబాలకు చెందిన తల్లులు, శిశువులు ఉండడం బాధాకరమన్నారు. గర్భం దాల్చిన వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించాలన్నారు. వైద్యులు అంకిత భావంతో పనిచేసి మాతా శిశు మరణాలను నివారించాలన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆరోగ్య కేంద్రాలను తయారు చేసిందన్నారు. దీనితో పాటు వైద్య ఆరోగ్య శాఖలో స్పెషలిస్ట్ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, అత్యాధునిక సౌకర్యాలతో వసతులు కల్పించినప్పటికీ మాతా, శిశు మరణాలు జరగడం దురదృష్టకరమన్నారు. వైద్యుల నిర్లక్ష్యం ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. జూన్‌లో జరిగిన ఐదు మాతృ మరణాలు, 24 శిశు మరణాలు సంభవించగా వీటిపై సబ్ కమిటీతో ఆడిట్ నిర్వహించారు.

సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, డిస్ట్రిక్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ అమృత, వైద్యులు జె.హిందుమతి, పద్మావతి, ప్రభావతి, ఎస్.వినయకుమార్, ఆనందకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనది

ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ దేవానందరెడ్డి



ప్రసంగిస్తున్న దేవానందరెడ్డి, నారాయణరావు, సాంబశివరావు తదితరులు

విజయవాడకల్చరల్: భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శవంతమైనదని ఏపీ పరీక్షల విభాగం కమిషనర్ డి.దేవానందరెడ్డి అన్నారు. రసభారతి సాహితీ సంస్థ, శ్రీ గోళ్ల నారాయణమూర్తి, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో జంధ్యాల పరదేశిబాబు రచించిన తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథ పరిచయ సభను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవానందరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ వివాహ వ్యవస్థలో అనేక మధురమైన ఘట్టాలుంటాయని వాటికి శాస్త్రీయతతో పాటు సమాజానికి సందేశం ఇచ్చే అంశాలతో నిండి ఉంటుందన్నారు. నేడు వివాహ వ్యవస్థలో అనేక మార్పులు చేసుకుంటున్నాయని, చాలా సందర్భాల్లో కేవలం మొక్కుబడిగా సాగుతున్నాయని చెప్పారు. నేటి యవతరానికి వివాహ సంప్రదాయాలను తెలియజెప్పాల్సిన అవసరముందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ జంధ్యాల పరదేశిబాబు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో గ్రంథాలు రచించారని తెలిపారు. తెలుగు సాహిత్యంపై పుస్తకాలు విస్తృతంగా రావాల్సిన అవసరముందన్నారు. కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. పరదేశిబాబు సుదీర్ఘకాలంగా సాహితీ రంగంలో ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఓఎస్‌డీ చీఫ్ విప్ ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కల్యాణాలు గ్రంథాన్ని ఇంటర్ ఆపై తరగతులకు పాఠ్యాంశాలుగా చేయాలని సూచించారు. రసభారతి అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, విశ్రాంత ఇన్‌కమ్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందం, ఉపాధ్యాయుల సంఘం నాయకుడు డాక్టర్ డి.శ్రీను, పరదేశిబాబు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కావూరి సత్యవతి తెలుగు సాహిత్యంలో కల్యాణాల గ్రంథ విశేషాలను వివరించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, బ్యాంక్ అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన 116 మంది పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని రెయిన్ కోట్లు అందించారు. నగర వాసుల సహకారంతోనే పూర్తిస్థాయిలో పారిశుద్ధ్యాన్ని నిర్వహించగలమని పేర్కొన్నారు. అంతకు ముందు బ్యాంక్ ఆధ్వర్యంలో మధురానగర్ నుంచి బీఆర్టీఎస్ రోడ్ ఫుడ్ కోర్ట్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగులు కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా డెప్యూటీ జనరల్ మేనేజర్ - రీజినల్ హెడ్ విజయవాడ చందన్ సాహూ, డెప్యూటీ రీజనల్ మేనేజర్ ఏవీ భాస్కర్, సిటీ బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాద్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్, మోటరు వాహనా చట్టాలపై ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు. త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో గురువారం డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణించే వాహన చోదకులకు, పాదచారులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించి తద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మానవ తప్పిదాలు, డ్రైవర్ల నిర్లక్ష్యం వలన సంభవిస్తున్నాయని చెప్పారు. వాహన చోదకులు అవగాహనతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే తప్పకుండా ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతాయన్నారు. ప్రమాదాలు జరిగిన అనంతరం బాధపడేకంటే, ముందుగానే సురక్షిత డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న ఆటో డ్రైవర్లతో 'మేము మోటారు వాహన చట్టాలకు లోబడి డ్రైవింగ్ చేస్తామని, రహదారి నియమ నిబంధనలు, రహదారి భద్రతలు పాటిస్తామని, ఎదుటి వారి ప్రాణాల పట్ల జాగ్రత్త వహించి డ్రైవింగ్ చేస్తామని, నిర్లక్ష్యం వహించమని' ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ జి.శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు డి.వి.రమణ, ఐడీఎస్ రాజు, ఎస్ఐలు, సిబ్బంది, 250 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



జగనన్న సురక్ష సర్వే నిర్వహిస్తున్న కార్పొరేటర్ తిరుపతమ్మ, వలంటీర్

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ సూచించారు. కండ్రిక, ప్రజాశక్తి నగర్‌లలో గురువారం కార్పొరేటర్ వలంటీర్లతో పాటు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల క్యాలెండర్లను పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసే 11 రకాల సర్టిఫికెట్లను వివరించారు. సర్వేలో డివిజన్ కో ఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, విమల, అడ్మిన్, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి తెలిపారు. జగనన్న సురక్ష సర్వేను గురువారం 271 సచివాలయ పరిధిలో నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసే సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సర్వే చేసి సర్టిఫికెట్లు అందిస్తారని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేశారు. గృహసారథులు, కన్వీనర్లు వేము హైమావతి, సుభాని, ముత్తయ్య, సచివాలయ సిబ్బంది, నాయకులు రామిరెడ్డి పాల్గొన్నారు.

రైవస్ కాలువ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం సందర్భంగా నగరంలోని ప్రధాన కాలువలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువార నగర పర్యటనలో భాగంగా ఆయన నగరంలోని రైవస్ కాలువను పరిశీలించారు. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, నగరంలో ఎక్కడైన కాల్వల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి రోడ్లపై వేస్తున్న వారిని గుర్తించాలన్నారు. అవసరమైతే సమీప ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలను పరిశీలించి చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేస్తున్న వారికి జరిమానాలు విధించాలన్నారు. శానిటేషన్ వర్కర్స్ అందరూ పనిలోకి వచ్చి కాలువలు, వీధులు శుభ్రం చేస్తున్నారా లేనిది సంబంధిత ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కి సీ సర్టిఫికెట్స్ ప్రదానం



సర్టిఫికెట్స్ అందజేస్తున్న భన్వర్‌రామ్, ప్రిన్సిపాల్ అనురాధ తదతరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎన్‌సీసీ – 4 ఆంధ్రా బాలికల బెటాలియన్ సుబేదార్ మేజర్ భన్వర్‌రామ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్‌లో సీ సర్టిఫికెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి గురువారం సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లెఫ్టినెంట్ భన్వర్‌రామ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ ఉత్తీర్ణులైన వారికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసులోకి వెళ్లవచ్చని, సర్వీస్ కమిషన్ పరీక్షల్లో కూడా రాత పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ఎన్‌సీసీ కోటాను అమలు చేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా 17 మంది కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ సుబేదార్ లక్ష్మణ్‌సింగ్, కళాశాల ఏఎన్ఓ. రఫీయాబేగం పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఐరన్ అండ్ హార్డ్‌వేర్ మర్చంట్స్ అసోసియేషన్, విజయ స్టీల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొనకళ్ల వాసుదేవ సూర్యశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవానీపురం ఐరన్ కాంప్లెక్స్ సొసైటీ భవనంలో నిర్వహించే శిబిరంలో మానస హాస్పిటల్‌కు చెందిన వైద్యులు పాల్గొని జీర్ణకోశ(గ్యాస్ట్రో), మానసిక సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్కే అయోధ్య, డాక్టర్ మానస కాజ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సూరే పవన్‌కుమార్‌లు పాల్గొని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్షలు చేస్తారన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మద్యం సేవించి భర్త వేధించటంతో పాటు అదనపు కట్నం తీసుకురమ్మని కొడుతున్నాడంటూ భార్య ఫిర్యాదు మేరకు గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నక్క స్వాతికి అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన రెడ్డి శరత్‌కుమార్‌తో 2019లో వివాహమైంది. వివాహ సమయంలో రూ.5లక్షలు కట్నం, బంగారం ఇచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లో కాపురం పెట్టారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్న శరత్‌కుమార్ మద్యం సేవించి భార్యను తరచూ వేధించటంతో పాటు చేయిచేసుకుంటున్నాడు. భర్త వేధింపులు భరించలేక తల్లిదండ్రులతో మాట్లాడి రూ.8 లక్షలు ఇచ్చి వ్యాపారం పెట్టించినప్పటికీ భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవటంతో గురువారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో స్వాతి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తల్లిదండ్రుల పోషణ చట్టంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారథి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డి.పార్థసారథి అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. వీలునామా, గిఫ్ట్ డీడ్‌లపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ తదనంతరం మాత్రమే పిల్లలకు ఆస్తులు చెందేటట్లు ఏర్పాట్లు చేయాలని, ముందుగానే ఆస్తుల్ని ఇవ్వడం వలన ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. ఆస్తులు రాయించుకుని తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటివేసిన ఘటనలు చూస్తున్నామని చెప్పారు. ముందుగానే ఆస్తులు రాయించుకుని ఇబ్బందులకు గురిచేస్తే వీలునామా రద్దు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆస్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో వేమూరు బాబూరావు, పూడి శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.రాము, సంఘం సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతి, ఎస్.బాలాజీ, సైకాలజిస్ట్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

శ్రీరాముడు చూపిన మార్గంలో పయనించాలి



ప్రవచనం చేస్తున్న రాధా మనోహర్‌దాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సకల గుణాభిరాముడు శ్రీరాముడు అని, ప్రతీ ఒక్కరూ శ్రీరాముడు చూపిన మార్గంలో పయనించాలని ప్రముఖ హిందూ దర్మ ప్రచారకులు రాధామనోహర్ దాస్ సూచించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ కోదండ రామాలయంలో గురువారం సాయంత్రం అంతా రామమయం ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణం మనకు ఎన్నో విషయాలను తెలియజేస్తుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో యువత ఏవిధంగా పరిస్థితులను ఎదుర్కోవాలి, నిరాశ నిస్పృహలకు లోనుకాకుండా మనోధైర్యం పెంపొందించుకోవటంలో రామాయణం ఏ విధంగా దోహద పడుతుందో వివరించారు. రామాయణంలోని ప్రముఖ ఘట్టాలను ఉదాహరణలతో అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన రాధామనోహర్ దాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు, ఐఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.